పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి

'పెద్ద ఎత్తున మురికివాడలు ఉన్న జల్‌పల్లిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. మున్సిపల్ పరిధిలోని అన్ని బస్తీల్లో ఎప్పటికప్పుడు టెమోపాస్ మందును పిచికారీ చేయిస్తున్నాం. ఆరు మిషన్ల ద్వారా ఫాగింగ్ నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా ప్రజలంతా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంట్లోని నీటిని పారబోసి, కొత్తగా పట్టుకోవాలి. పారిశుద్ధ్యం, విషజ్వరాల నివారణలో స్థానిక కౌన్సిలర్లను కూడా భాగస్వాములను చేస్తున్నాం' అని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి అన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌కు విశేష స్పందన లభించింది. సమస్యలను స్వయంగా నోట్ చేసుకున్న ఆమె పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విష జ్వరాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. – పహాడీషరీఫ్

- ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయిస్తున్నాం
- కౌన్సిలర్లను భాగస్వాములను చేస్తున్నాం
- సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం
- జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



శ్రీరాం కాలనీలో ఫాగింగ్ సరిగ్గా చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలు ప్రబలుతున్నాయి. చెత్త పాయింట్ల వద్ద బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు.
– కాట్రగడ్డ వాసుబాబు, శ్రీరాం కాలనీ

కమిషనర్: సిబ్బందిని పంపించి ఫాగింగ్ చేయించేలా చర్యలు తీసుకుంటాను.

శ్రీరాం కాలనీలోని భవిష్య పాఠశాల పక్కన రోడ్డుపై నెల రోజుల క్రితం గొయ్యి ఏర్పడింది. ప్రస్తుతం వర్షం, మురుగునీరంతా అందులో చేరడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది.
– నాగార్జున, శ్రీరాం కాలనీ

కమిషనర్: స్వయంగా పరిశీలించి మట్టితో పూడ్చేలా చూస్తా.

షాహిన్‌నగర్‌లో మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. మ్యాన్‌హోల్‌కు పైకప్పు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల, మసీద్ ఉండడంతో అక్కడికి వెళ్లే వారికి ఇబ్బందిగా ఉంది. ఫాగింగ్ కూడా చేయడం లేదు.
– సయ్యద్ అబ్దుల్ రవూఫ్, షాహిన్‌నగర్

కమిషనర్: వెంటనే సిబ్బందిని పంపి మ్యాన్‌హోల్ పైకప్పు సమస్యను పరిష్కరిస్తాం. ఫాగింగ్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహిస్తాం.

ఎర్రకుంటలో చెత్త తరలింపు ఆటోలు రావడం లేదు. స్థానికంగా నాలాకు పైకప్పు లేదు. ఎర్రకుంట చౌరస్తాలో శిథిలమైన రహదారికి మరమ్మతులు చేయడం లేదు.
– షర్ఫుద్దీన్ హామెద్, ఎర్రకుంట

కమిషనర్: వర్షాలు తగ్గగానే ఎర్రకుంట రహదారికి మరమ్మతులు చేయిస్తాం. నాలా పైకప్పు విషయమై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఆటోలు కూడా రెండు రోజులకు ఒకసారి వచ్చేలా చూస్తాం.

జల్‌పల్లి గ్రామంలో డంపింగ్ యార్డ్ కారణంగా దోమలు వృద్ధి చెంది గ్రామస్తులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఫాగింగ్ కూడా చేయడం లేదు.
– యంజాల శివకుమార్, జల్‌పల్లి

కమిషనర్: ప్రస్తుతం సేకరిస్తున్న చెత్తను కాటేదాన్‌కు తరలిస్తున్నాం. ఫాగింగ్‌పై చర్యలు తీసుకుంటాం.

ఉస్మాన్‌నగర్‌లో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. జ్వరాల బారిన పడుతున్నాం. చెత్త ఆటోలు కూడా రావడం లేదు.
– సలీం, ఉస్మాన్‌నగర్

కమిషనర్: వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తా.

జల్‌పల్లి గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట అంధకారం నెలకొంటోంది. మోరీలు పొరుతున్నాయి. స్థానికంగా ఉన్న తాళ్లకుంట కబ్జాకు గురవుతోంది.
– మురళీకృష్ణ, జల్‌పల్లి

కమిషనర్: కబ్జా విషయం ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. నూతన పైప్‌లైన్ ఇప్పటికే మంజూరైంది.

వాదే ముస్తఫా బస్తీలో ఏడు నెలల క్రితం కొత్త రోడ్డు కోసమని తవ్వి వదిలేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.
– సయ్యద్ హుస్సేన్, వాదే ముస్తఫా

కమిషనర్: ఏఈతో మాట్లాడి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తా.

కాలనీలు ముంపు బారిన పడకుండా చేశాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: గతంలో వర్షాకాలంలో డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీ, గుంటి జంగయ్యనగర్, అభ్యుదయనగర్, జనప్రియహోమ్స్ తదితర కాలనీలు ముంపునకు గురయ్యేవని ఈసారి భారీ వర్షాలు కురిసినా ఆ పరిస్థితి లేకుండా చేశామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రిస్టియన్ కాలనీలో కొత్తగా ట్రంక్‌లైన్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించామని అన్నారు. జాతీయ రహదారి ఎత్తు పెంపుతో అభ్యుదయనగర్, జనప్రియహోమ్స్ కాలనీలు ముంపు బారిన పడే అవకాశం ఉండగా సంబంధిత అధికారులతో మాట్లాడి వరద సాఫీగా పారేలా పైపులైన్లను వేయించి నాలాకు కలపడం జరిగిందన్నారు. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకుని కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు దేసాని హరీందర్‌రెడ్డి, నాగార్జున కాలనీ అధ్యక్షుడు లట్టుపల్లి మోహన్‌రెడ్డి, అభ్యుదయనగర్ కాలనీ అధ్యక్షుడు మోతె రంగారెడ్డి, అనిల్, సత్యనారాయణ, నరేందర్‌రెడ్డి, సలావుద్దీన్, రాములు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాగోలు: పూజచేసే సమయంలో ప్రమాదవశాత్తు చీరకు దీపం మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..ఎల్‌బీనగర్ కాకతీయనగర్ కాలనీ చెందిన ఆర్. నాగకామేశ్వరి(64) గత నెల 28న పూజగదిలో దీపం వెలిగిస్తుండగా ఆమె చీరకు దీపం మంట అంటుకుంది. వెంటనే మంటలను ఆర్పి కొత్తపేటలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది.

బాలికపై లైంగిక దాడి


నాగోలు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని ఎల్‌బీనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ గుంటిజంగయ్య కాలనీకి చెందిన శ్రీకాంత్ దిల్‌సుఖ్‌నగర్‌లోని బియ్యం షాపులో పనిచేస్తున్నాడు. అదే కాలనీలో ఉంటున్న బాలిక(17)తో పరిచయం పెంచుకుని ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. ఆదివారం ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు సోమవారం ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



నాలా మాయం.. మార్కెట్ మురుగు మయం!

- మాదన్నపేట మండిలో కనిపించని నాలా
- వరద నిలుస్తుండటంతో చిత్తడిగా మారుతున్న మైదానం
- ఇబ్బందులు పడుతున్న రైతులు, స్థానికులు
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చంచల్‌గూడ: అధికారుల పర్యవేక్షణ లేక విలువైన ప్రభుత్వ స్థలాలు ప్రజల సౌకర్యార్థం నిర్మించిన నాలాలు ఆక్రమణకు గురై వాటి జాడ లేకుండా పోతోంది. ఆయా స్థలాల్లో ఆకాశన్నంటేలా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కొన్ని చోట్ల ఏకంగా నాలాలను పూడ్చి నిర్మాణాలు చేపట్టడంతో వాటి ప్రభావం సామాన్య ప్రజలు, రైతులపై పడుతోంది. కుర్మగూడ డివిజన్ మాదన్నపేట కూరగాయాల మార్కెట్ సరిహద్దుల్లో పెద్ద నాలా ఉండేది. ఇది మాదన్నపేట మండి నుంచి బడా బజార్ మీదుగా మూసీ నదిలో కలిసేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ నాలా ఆనవాళ్లు లేవని వాపోతున్నారు. నాలా కబ్జాలతో డివిజన్‌లోని భరత్‌నగర్, పలు మైనార్టీ బస్తీల్లో వరద చేరుతుందని బస్తీవాసులు వాపోతున్నారు. నాలాల కబ్జాలపై గతంలో అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మాదన్నపేట నాలా మ్యాప్

కానరాని అధికారుల పర్యవేక్షణ..

నాలాల కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని గత ప్రభుత్వంలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖమంత్రిగా పని చేసిన కేటీఆర్ వెల్లడించారు. కానీ ఆయన మాటలు కార్యరూపం దాల్చలేదు. భారీ వర్షాలు వచ్చినప్పుడు ప్రభుత్వాలకు నాలాల కబ్జా విషయం గుర్తుకు వస్తుందని పలువురు ఎద్దేవా చేశారు. నగరంలో నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించే పని జీహెచ్‌ఎంసీకి అప్పగించినా అధికారులు మాత్రం అంతగా పట్టించుకోలేదు.

నాలాపై పదుల సంఖ్యల్లో నిర్మాణాలు

కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలో కబ్జాకు గురైన నాలాల వైపు అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం వారి పనితనానికి నిదర్శనం. మాదన్నపేట ప్రాంతంలో నాలాల కబ్జాకు గురవడంతో వరదనీరు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఈ ప్రాంతంలో కబ్జాకు గురైన నాలాపై సుమారు 10 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని ఉపేక్షించేది లేదని గత ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన వారు వీలు చిక్కినప్పుడల్లా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారని ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ అంశంపై స్పందిస్తుందా.. లేదా అని ఆశగా ఎదురు చేస్తున్నారు.

నాలా కబ్జాతో ఇబ్బందులు...

మండిలో పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఓ పక్క రైతే రాజు అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వానికి మాదన్నపేట మార్కెట్‌లోని సమస్యలు కనిపించడం, వినిపించడం లేదా అని రైతులు, వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోదు పాలకులు ఇటు వైపు చూడకపోవడంతో మండి డంపింగ్ యార్డును తలపిస్తుంది. మార్కెట్ చుట్టూ ఉన్న నాలా కబ్జాకు గురి కావడంతో వరదనీరు మార్కెట్‌లో నిలిచిపోతున్నాయి. మరో పక్క డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. చినుకులు కురిస్తేనే కుంటలా మారి నెలల తరబడి నీరు నిలుస్తుందని వాపోతున్నారు.

నాలాలపై ఆక్రమణలు తొలగించాలి



నాలాల కబ్జాలతో వరదనీరు కూరగాయల మార్కెట్‌లోకి చేరుతుంది. దీని వల్ల మురుకుంటగా ఏర్పడి రైతులు, బస్తీవాసులు, వ్యాపారులు అనారోగ్యాలకు గురవుతున్నారు. మాదన్న పేట మండి చుట్టూ పక్కల నాలాలపై వెలిసిన అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలి.
–సహదేవ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్

డ్రైనేజీ లైన్ నిర్మించాలి..



మాదన్నపేట మార్కెట్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం ప్రధాన సమస్య. చిన్న వర్షం పడితే నెలల తరబడి వరద నీరు నిలిచిపోతుంది. రానున్న వర్షాకాలంలో దృష్టిలో పెట్టుకుని యుద్ధ ప్రతిపాదికన డ్రైనేజీ లైన్ నిర్మించాలి. జీహెచ్‌ఎంసీ, మార్కెట్ శాఖలు శ్రద్ధ చూపిస్తే రైతుతు, వ్యాపారులు, ప్రజలకు ఎంతో మేలు చేసినవారవుతారు. మార్కెట్ శాఖ కొన్ని నెలల ఆదాయంతో సునాయసంగా డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయవచ్చు.
–ఏనుగు రాంరెడ్డి, రైతునేత

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమోటా రూ.21, వంకాయ రూ.23, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.50, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.44, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.13, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, అర్వి రూ.40, మునగ రూ.28, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.95, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: సామాజిక సేవలతో సంతృప్తి కలుగుతుందని మూసారంబాగ్ జ్ఞానదీప్ టవర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. సోమవారం దిల్‌సుఖ్‌నగర్ మారుతిమందిర్ వద్ద స్థానిక వ్యాపారులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బుజ్జినాయుడు, శ్రీపాద్, గణేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కేక్‌కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి హయత్‌నగర్ పబ్లిక్ స్కూల్ 2009–10 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. వివిధ హోదాల్లో స్థిరపడిన వారు ఒక్కచోటుకు చేరుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.14 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఆటపాటలతో సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులు పొరంద సాయిప్రసాద్, శివారెడ్డి, భరత్, చైతన్య, మాధురి, విజయ్‌గౌడ్, మౌనిక, శిరీష, హర్షద్, రాజేష్, ఇర్ఫాన్, రూబి, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, అస్మత్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.







3వ రోజు ముసురేసింది!

గత రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. రెండు రోజులు భారీగా కురిసిన వాన సోమవారం ఉదయం నుంచే ముసురుతో మొదలై సాయంత్రం చినుకులు కురిశాయి. వర్షంతో చిరు వ్యాపారులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. రోజు వారి కూలీలు పనులు దొరక్క ఇంటిముఖం పట్టారు. ఏకధాటిగా కురిసిన ముసురుతో ద్విచక్రవాహనాలు, పాదచారులు గొడుగులతో వెళ్తూ కనిపించారు. –నాగోలు

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



రాజు

చాదర్‌ఘాట్: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు సూచించారు.సోమవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్ పరిధిలో దాదాపు 70కి పైగా మండపాలకు దరఖాస్తులు వచ్చాయని ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసుల అనుమతి ప్రకారమే గణపతి నిమజ్జన యాత్ర కొనసాగాలన్నారు. కాలనీల్లో అనుమానితులు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు..

లింగోజిగూడ: వినాయక చవితి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్ తెలిపారు. ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఉత్సవ సమితి సభ్యులు, కార్పొరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల సమీపంలో ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వంగ మదుసూధన్‌రెడ్డి, బానోతు సుజాతానాయక్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం



ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నియామకమయ్యారు. పునటి శ్రీకాంత్, నరేందర్ స్వామిను వైస్ ప్రెసిడెంట్‌గా ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ భాస్కర్, జాయింట్ కార్యదర్శులుగా పిల్లలమర్రి రమేశ్ నాగరాజు, కోశాధికారిగా హర్ష యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా షేక్ రేష్మా, వేణుకుమార్ సీతల్ మోహందాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

నీరు నిలువకుండా చర్యలు



పనులు పరిశీలిస్తున్న డీసీ యాదయ్య

ఎల్‌బీనగర్: లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటున్నామని హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు. గత మూడ్రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం అధికారులతో కలిసి ఆయన లోతట్టు ప్రాంతాలను పరిశీలించి వరద సాఫీగా పారేలా పనులు చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, ఈఈ రమేష్‌బాబు, ఏఈలు రాకేష్, నాయక్ ఉన్నారు.

ప్రత్యేక పూజలు



మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి తృతీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాన్యాస సహిత రుద్రాభిషేకం, 108 కలశాలతో అభిషేకాలు, బిల్వార్చన, రుద్ర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, కేశవులు, కృష్ణమూర్తి, అజయ్, మురళి పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



కృష్ణ

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..నాగోలు జైపురికాలనీకి చెందిన పరవస్తు కృష్ణ(75) గత నెల 30న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులలో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణకు మాటలు కూడా సరిగా రావని తెలిపారు.

వరద సాఫీగా పారేలా చర్యలు

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో వర్షపు నీరు రోడ్లపై నిలువకుండా చర్యలు చేపట్టామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధి శారదానగర్‌లో మాన్‌సూన్ సిబ్బందితో కలిసి పర్యటించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేసి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఆయన వెంట నరసింహారావు, యాదయ్య, మధు ఉన్నారు.



చిత్రలేపుట్ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పేదల మదిలో పదిలం వైఎస్సార్

దివంగత ముఖ్యమంత్రి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గతంలో వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ఎందరికో చేయూతనిస్తున్నాయన్నారు. –దిల్‌సుఖ్‌నగర్/మన్సూరాబాద్/చంపాపేట



వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి



కర్మన్‌ఘాట్ వైఎస్సార్ చౌరస్తాలో..